సాక్షి నంద్యాల
ఆదివారం | 17 | ఆగస్టు | 2025



గుట్టుగా కెమికల్ ఫ్యాక్టరీ నిర్మాణం

జూపాడుబంగ్లా మండలం తంగడంచ గ్రామ రెవెన్యూ పరిధిలో గుట్టుచప్పుడుకాకుండా ఓ కెమికల్ ఫ్యాక్టరీ నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. 8లో▸



నృత్య నివేదన

శ్రీశైలం టెంపుల్: ధర్మపథంలో భాగంగా శనివారం శ్రీశైలంలోని నిత్య కళావేదిక పై కర్నూలుకు చెందిన శారద సంగీత నృత్య కళాశాల విద్యార్థినులు సంప్రదాయ నృత్యం చేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.06
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:28,721
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:28,567

న్యూస్‌రీల్

శ్రీశైలంలో భక్తుల రద్దీ



క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: వరుస సెలవుల నేపథ్యంలో శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

శాస్త్రోక్తంగా గోపూజ



గోపూజలో దేవస్థాన ఈఓ దంపతులు

శ్రీశైలంటెంపుల్: కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానంలోని శ్రీగోకులంలో శాస్త్రోక్తంగా గోపూజను నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు, పండితులు పూజా సంకల్పాన్ని పఠించారు. అనంతరం శ్రీసూక్తంతోనూ, గో అష్టోత్తర మంత్రంతోనూ, గోవులకు షోడశ ఉపచారాలతో పూజాదికాలు జరిపించారు. గోవులకు నివేదన, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. దేవస్థాన గోసంరక్షణశాలలో కూడా శ్రీకృష్ణుని పూజ, గోపూజ జరిపించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు.

యూరియా పక్కదారి!



ప్రైవేట్ గోడౌన్ వద్ద యూరియా లారీలు

మహానంది: రైతు సేవాకేంద్రానికి వచ్చిన యూరియా పక్కదారి పడుతోంది. టీడీపీ నేతల సహకారంతో ప్రైవేటు గోడౌన్లకు తరలుతోంది. మసీదుపురం గ్రామ సమీపంలోని ఓ ప్రైవేటు గోడౌన్‌కు రెండు లారీల యూరియా వెళ్లడం చర్చనీయాంశమైంది. రైతులకు యూరియా అందించకుండా పక్కదారి మళ్లిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మసీదుపురం గ్రామ సర్పంచ్ లక్ష్మిరెడ్డి, ఎంపీటీసీ మల్లికార్జునరెడ్డి కోరారు. ఈ విషయంపై ఏఓ నాగేశ్వరరెడ్డిని వివరణ కోరగా.. గ్రామ సమీపంలో వంతెన మరమ్మతులు జరుగుతుండటంతో యూరియా నిల్వలు అక్కడే ఉంచి రైతులకు పంపిణీ చేసినట్లు చెప్పారు.

పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల పెంపు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలను 26వేల నుంచి 30 వేల క్యూసెక్కులకు పెంచినట్లు ఏఈ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ గేట్లను 0.05 అడుగు మేర ఎత్తి నీటినిఎస్సార్ఎమ్సీ కాల్వలోకి విడుదల చేస్తున్నామన్నారు. ఈ నీటిని బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగ కాల్వకు 12వేల క్యూసెక్కులు, ఎస్సార్బీసీ(జీఎన్ఎస్ఎస్)కాల్వకు 10వేలు, కేసీ ఎస్కేప్ కాల్వకు 8వేల క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.

విద్యుదాఘాతంతో చిరుతపులికి గాయాలు



విద్యుదాఘాతానికి గురై గాయపడిన చిరుత

శ్రీశైలంప్రాజెక్ట్: విద్యుదాఘాతంతో శనివారం రాత్రి లింగాలగట్టు గ్రామం వద్ద చిరుతపులికి గాయాలు అయ్యాయి. కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రం దిగువన, లింగాలగట్టు గ్రామం పొలిమేరలో ఈ ఘటన చోటుచేసుకుంది. అటవీ ప్రాంతం నుంచి వచ్చిన చిరుత పులి కొండ చరియలను దాటుకొనే ప్రయత్నంలో జారి పడింది. ఆ ప్రాంతంలో లింగాలగట్టు వాసుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి విద్యుదాఘాతంతో గాయాలు అయ్యాయి. గాయాలతోనే అక్కడే ఉన్న పొదల్లోకి వెళ్లింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు.

వీధుల్లో మృత్యువు!

బెంబేలెత్తిస్తున్న కుక్కలు

- గత ఏడాది ఐదుగురు.. ఈ ఏడాది ఇప్పటికే ముగ్గురు మృత్యువాత
- వీధుల్లో భయపెడుతున్న శునకాల గుంపు
- గత ఏడాది ఒకేరోజు కర్నూలులో 40 మంది చిన్నారులపై దాడి
- కట్టడి చేయాలని సుప్రీం కోర్టు ఆదేశం
- పీహెచ్‌సీల్లో కనిపించని ఇమ్యునోగ్లోబిన్స్ ఇంజెక్షన్లు



గడివేముల సమీపంలో కుక్కల గుంపు

కర్నూలు(హాస్పిటల్): కుక్కల గుంపు కనిపిస్తే చాలు గుండె జారిపోతోంది. ఉన్నఫలంగా మీద పడి కరిచేస్తుండటంతో అడుగు ముందుకేయలేని పరిస్థితి ఉంటోంది. కరవడం వరకు ఒక ఎత్తయితే, ఇటీవల కాలంలో మరణాలు కూడా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. మరీ ముఖ్యంగా చిన్న పిల్లలు కుక్కల బారిన ప్రాణాలు కోల్పోతున్నారు. వీటిని నియంత్రించాల్సిన మున్సిపల్, పంచాయతీ శాఖలు చేష్టలుడిగి చూస్తున్నాయి. ఒకప్పుడు కుక్కలను తీసుకెళ్లి చంపేవాళ్లు. జంతు ప్రేమికులు ఈ చర్యను అడ్డుకోవడంతో కుక్కల నియంత్రణకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం మొదలుపెట్టారు. అయితే ఈ కార్యక్రమం కొద్ది రోజులకే అటకెక్కడంతో ఇటీవల కాలంలో కుక్కల సంఖ్య అధికమైంది. వీధుల్లో తిరగాలంటేనే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఒక రాత్రిళ్లు బయటకు రావాలంటేనే భయాందోళనకు లోనవుతుండటం గమనార్హం. ఇకపోతే ఆసుపత్రులన్నింటిలో కుక్కకాటుకు ఏఆర్‌వి ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచుతున్నారు. కానీ పిచ్చికుక్క కాటుకు వాడే ఇమ్యునోగ్లోబిన్స్ కేవలం ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. ఈ కారణంగా పిచ్చికుక్కకాటుకు గురైన వారు రేబిస్ వ్యాధితో మృత్యువాత పడుతున్నారు. ఏది మంచి కుక్క, ఏది పిచ్చి కుక్క అనే విషయం తెలియని కొందరు కేవలం కుక్కకాటుకు ఏఆర్‌వి ఇంజెక్షన్లు మాత్రమే వేయించుకుంటుండటంతో మరణాల సంఖ్య పెరుగుతోంది. గత ఏడాదిలో ఐదుగురు రేబిస్‌తో మరణించగా, ఈ యేడాది ముగ్గురు మరణించడం ఆందోళనకు గురిచేస్తోంది. గత ఏడాది డిసెంబర్‌లో కర్నూలు నగరంలోని పాతబస్తీలో ఒకే కుక్క 40 మందికి పైగా చిన్నారులను కొరకడంతో వారంతా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని చిన్నపిల్లల విభాగంలో చికిత్స పొందారు.

జీజీహెచ్‌లపైనే భారం

కుక్కకాటుకు గురై తీవ్ర రక్తగాయాలైన వారికి కర్నూలు, నంద్యాలలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలే పెద్ద దిక్కు. ఆయా ఆసుపత్రుల్లోని ఐడీ విభాగాలకు ప్రతిరోజూ 50 నుంచి 70 వరకు కుక్కకాటు బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. సాధారణ కుక్కకాటు బాధితులకు ఏఆర్‌వి ఇంజెక్షన్లు ఇస్తుండగా పిచ్చికుక్క కాటుకు గురైన వారికి, ముఖం వద్ద తీవ్ర గాయాలున్న వారికి వెంటనే ఇమ్యునోగ్లోబిన్స్ ఇంజెక్షన్లు ఇస్తున్నారు. ఈ ఇంజెక్షన్లు గత ప్రభుత్వంలో సెంట్రల్ డ్రగ్ స్టోర్ ద్వారా సరఫరా అయ్యేవి. కూటమి ప్రభుత్వంలో వీటిని స్థానికంగా కొనుగోలు చేసి రోగులకు అందించాల్సిన పరిస్థితి నెలకొంది.

చేష్టలుడిగి చూస్తున్న అధికారులు

కుక్కల సంఖ్య పెరిగి వాటి బారిన మరణాలు అధికమవుతున్నా అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు. కనీసం వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించే విషయంలోనూ చేతులెత్తేయడంతో ప్రజల ప్రాణాల మీదకొస్తోంది. ముఖ్యంగా చికెన్ విక్రయ దుకాణాల వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేస్తుండటంతో ఆ చుట్టూ కుక్కల గుండపు అధికమవుతోంది. ఈ నేపథ్యంలోనే వ్యర్థాలు దొరకని సమయంలో కుక్కలు క్రూరంగా ప్రవర్తిస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలోనైనా జిల్లా అధికారులు మేల్కొనాలని ప్రజలు కోరుతున్నారు.

జనవరి 21, 2025

కొత్తాళం మండలం ఉప్పరహాలు గ్రామానికి చెందిన వెంకటేష్ కుమార్తె కవిత(4) కుక్క కాటుకు గురైంది. రేబిస్ లక్షణాలు ఉండటంతో ర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చేర్పించారు. వారం రోజుల తర్వాత పాపను ఇంటికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మరణించింది.

ఫిబ్రవరి 5, 2025

ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామానికి చెందిన మొహిద్దీన్ బాషా(13)ను గత జనవరి 9న కుక్క కరిచింది. హుసేనాపురం పీహెచ్‌సీలో బాలునికి ఏఆర్‌వీ ఇంజెక్షన్లు వేయించారు. ఆ తర్వాత కూడా రేబిస్ లక్షణాలు ఉండటంతో ఫిబ్రవరి 4న కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక ఫిబ్రవరి 5న మరణించాడు.

మే 2, 2025

బేతంచర్ల పట్టణంలో షేక్ మొహిద్దీన్ అనే బాలుడు ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కల గుంపు దాడి చేసింది. బాలుని శరీరంలో ఎక్కడికక్కడ కండలు ఊడిపడ్డాయి. ఒళ్లంతా రక్తమోడింది. ఆసుపత్రికి తరలించేలోపే కన్నుమూశాడు.

వీధుల్లో ఒక్క కుక్క కూడా ఉండకూడదు. వెంటనే వాటిని డాగ్ షెల్టర్లకు తరలించండి.

– దేశ రాజధాని ఢిల్లీలో కుక్క కాటు కేసులు పెరిగిపోతున్న నేపథ్యంలో ఇటీవల సుప్రీం కోర్టు ఆదేశం

13,518 ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత ఏడు నెలల్లో కుక్క కాటు కేసులు

కుక్కల దాడిలో 40 గొర్రె పిల్లలు మృతి



మృతి చెందిన గొర్రెపిల్లలు

ప్యాపిలి: పట్టణ సమీపంలోని బొమ్మికుంట వద్ద కుక్కల దాడిలో 40 గొర్రె పిల్లలు మృతి చెందాయి. ప్యాపిలికి చెందిన బాలచంద్రుడు, బాలరాజుకు చెందిన గొర్రెపిల్లలపై ఒక్కసారిగా కుక్కలు దాడి చేయడంతో 40 గొర్రెపిల్లలు మృత్యువాత పడ్డాయి. దీంతో దాదాపు రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకుని నష్టపరిహారం అందజేయాలని బాధితులు వాపోయారు.

అందుబాటులో కుక్కకాటు వ్యాక్సిన్



జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో కుక్కకాటుకు ఏఆర్‌వీ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. ఇమ్యునోగ్లోబిన్స్ ఇంజెక్షన్లు కర్నూలు పెద్దాసుపత్రిలో మాత్రమే ఉంటాయి. కుక్కకాటు కేసులు పెరుగుతున్న విషయాన్ని, వాటిని నియంత్రించాలని పేర్కొంటూ మున్సిపాలిటీ, పంచాయతీ శాఖలకు సమాచారం అందించాం. కుక్కకాటుకు గురైన వారు వైద్యులు సూచించిన మేరకు వ్యాక్సిన్ వేయించుకోవాలి. – డాక్టర్ పి.శాంతికళ, డీఎంహెచ్‌వో, కర్నూలు

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది కుక్కకాటు కేసులు

మాసం	కర్నూలు జిల్లా	నంద్యాల జిల్లా
జనవరి	1,027	1,039
ఫిబ్రవరి	895	920
మార్చి	999	903
ఏప్రిల్	783	954
మే	1,098	723
జూన్	851	709
జులై	1,290	1,327

నడుచుకుంటూ వెళ్తుంటే కొరికింది



నేను టైర్ల పనిచేస్తూ జీవనం సాగిస్తుంటా. ఈ నెల 10న పని ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వెళ్తుంటే కుక్క వెంటపడి మరీ కరిచింది. దీంతో భయమేసి ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నా. టౌన్‌లో ఏ వీధి చూసినా కుక్కల భయమే. కొత్తవాళ్లను చూస్తే వెంటపడుతున్నాయి. వాటి నుంచి తప్పించుకుని జాగ్రత్తగా వెళ్లాల్సి వస్తోంది.

– పవన్‌కుమార్, పాతబస్టాండ్, కర్నూలు

వీధిలో ఆడుకుంటున్న పిల్లాడిని కరిచింది



మా కుమారుడు దేవాన్ష్‌కు ఐదేళ్లు. ఈనెల 8న వీధిలో ఆడుకుంటుండగా కుక్క కరిచింది. వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా ఇంజెక్షన్ వేశారు. ఆ తర్వాత రెండో డోసు కూడా వేయించాం. మా వీధిలో కుక్కలు చాలా ఎక్కువ ఉన్నాయి. చూస్తేనే గుండె జారుతోంది. పిల్లలు కనిపిస్తే చాలు మీదకొస్తున్నాయి.

– దేవరాజు, ఎన్‌టీఆర్ కాలనీ, కర్నూలు



శ్రీమఠం ఎదుట ఉట్టి కొడుతున్న పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు

రమణీయం.. ఉట్లోత్సవం


- శ్రీమఠంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

మంత్రాలయం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో శనివారం ఉట్లోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల స్వయంగా ఉట్టి కొట్టి అందరిలో భక్తిభావాన్ని నింపారు. ఉత్సవాల సందర్భంగా శ్రీకృష్ణుడి మూలవిరాట్‌కు పీఠాధిపతి విశిష్ట పూజలు చేశారు. సాయంత్రం శ్రీ మఠం మధ్య కారిడార్‌లో ఉట్లోత్సవం కార్యక్రమం చేపట్టారు. రంగు నీళ్ల చల్లుకుంటూ ఉట్లోత్సవం వైభవంగా కొనసాగింది. ఘనంగా నిర్వహించిన కృష్ణాష్టమి ఉత్సవాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



కర్నూలులోని ఇస్కాన్ మందిరంలో పూజలు అందుకున్న జగన్నాథ్, బలదేవ్, సుభద్ర విగ్రహాలు

విప్లవ జోహార్లతో చిన్నన్న అంత్యక్రియలు



చిన్నన్న (ఫైల్)



చిన్నన్న అంతిమ యాత్ర

ఆత్మకూరురూరల్: విప్లవ జోహార్లతో సుగులూరి చిన్నన్న అంత్యక్రియలు శనివారం నిర్వహించారు. నాలుగురోజుల కిందట మహారాష్ట్ర –ఛత్తీస్‌ఘడ్ సరిహద్దు ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ సుగులూరి చిన్నన్న మృతిచెందారు. ఆత్మకూరు మండలం వడ్లరామాపురం గ్రామానికి శనివారం ఉదయం 10 గంటలకు మృతదేహం వచ్చింది. ఆయన అంత్యక్రియల్లో పాల్గొనేందుకు చుట్టు పక్కల గ్రామాలనుంచే కాకుండా తెలుగు రాష్ట్రాల రెండింటి నుంచి పలువురు వడ్ల రామాపురం చేరుకున్నారు. అమరుల బంధుమిత్రుల కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ చిన్నన్న అలియాస్ శంకర్, అలియాస్ విజయ్ అంత్యక్రియలు విప్లవ సంప్రదాయానికి అనుగుణంగా నిర్వహించారు. చిన్నన్న పార్థివ దేహంపై ఎర్రజెండా కప్పి 'అమర వీరుల ఆశయాలను సాధిద్దాం ... కామ్రేడ్ చిన్నన్న అమర్ రహే' అని నినదించారు. చిన్నన్న మృతదేహాన్ని ట్రాక్టర్ పై ఉంచి గ్రామ వీధుల గుండా భారీ ర్యాలీతో ఆయన కుటుంబ పొలంలోకి తీసుకువెళ్లారు. అక్కడ ఆయన మృతదేహాన్ని విప్లవ సంప్రదాయాలతో ఖననం చేశారు. అమరుల బంధుమిత్రుల కమిటీకి చెందిన పద్మ, భవాని, శోభ, అంజమ్మ, విరసం సభ్యులు పినాకపాణి, ఏపి పౌర హక్కుల సంఘం నాయకులు అల్లాబకాష్, కరీం బాషా, తెలంగాణ పౌరహక్కుల సంఘం నాయకులు ఆర్.రాజానందం, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి నర్సింహయ్య, సీపీఐ ఎంఎల్ జనశక్తికి చెందిన సుంకన్న, వైద్యులు డాక్టర్ నాగన్న, డాక్టర్ గౌరీనాథ్, వివిధ దళిత సంఘాల నాయకులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలను నిర్మూలించడం అసాధ్యం

మావోయిస్టు పార్టీ సభ్యులను కాల్చి చంపడం ద్వారా ప్రజా ఉద్యమాలను నిర్మూలించడం ప్రభుత్వాలకు సాధ్యం కాదని విప్లవ రచయితల సంఘం పూర్వ కార్యదర్శి పాణి అన్నారు. ఆత్మకూరు మండలం వడ్లరామాపురంలో శనివారం కామ్రేడ్ చిన్నన్న అంత్యక్రియలకు హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దండకారణ్యంలో అత్యంత పాశవికంగా 'కగార్ ఆపరేషన్' జరుపుతోందన్నారు. అక్కడ ఉన్న అపార ఖనిజ నిక్షేపాలను కార్పొరేట్లకు అప్పగించేందుకు గిరిజనులకు అండగా నిలుస్తున్న మావోయిస్టులను హతం చేస్తున్నారని ఆరోపించారు. కామ్రేడ్ చిన్నన్న మూడు దశాబ్దాల విప్లవ జీవితంలో ఏనాడు వెనక్కి తిరిగి చూడలేదన్నారు.

శ్రీశైలండ్యాం నీటిమట్టం 882.10 అడుగులు



ఐదు క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్‌కు నీటి విడుదల

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి శనివారం సాయంత్రం నాటికి 5 రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా నాగార్జునసాగర్‌కు 1,33,720 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శుక్రవారం నుంచి శనివారం వరకు జూరాల, సుంకేసుల, హంద్రీల నుంచి శ్రీశైలానికి 2,05,212 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. దిగువ ప్రాంతాలకు జలాశయం నుంచి 1,89,111 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. స్పిల్‌వే ద్వారా 91,270 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పాదన అనంతరం 70,082 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదిలారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 25,333 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 2,426 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. డ్యాం పరిసర ప్రాంతాల్లో 0.40 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. కుడిగట్టు కేంద్రంలో 15.357 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 16.956 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. శనివారం సాయంత్రం సమయానికి జలాశయంలో 199.7354 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. డ్యాం నీటిమట్టం 882.10 అడుగులకు చేరుకుంది.

ఉచితం.. అగమ్యగోచరం

- మహిళలకు తప్పని తిప్పలు
- మూలపడిన పల్లెవెలుగు బస్సులు
- శ్రీశైల క్షేత్రానికి కొత్త బస్సు సర్వీసులు నిల్



ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండులో పల్లె వెలుగు బస్సు వద్ద మహిళల అవస్థలు

ఆత్మకూరు: మహిళలకు ఉచిత బస్సు అని రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటం చేస్తున్నా వాస్తవం అందుకు విరుద్ధంగా ఉంది. బస్టాండ్‌కు వెళ్లిన వారు ఉచిత బస్సుల కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. బస్సు వస్తుందో.. రాదో తెలియని దుస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం కొత్త బస్సులు కొనుగోలు చేయకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. అంతేకాక మూలనపడిన వాటికి మరమ్మతులు సైతం చేయలేదు. దీంతో ఉచిత బస్సు కోసం చూసే మహిళలకు నిరాశే ఎదురవుతోంది.గ్రామీణ ప్రాంతాలకు బస్సులు లేనప్పుడు ఉచిత ప్రయాణం ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి రావాలంటే, పట్టణం నుంచి పల్లెలకు వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలే దిక్కవుతున్నాయని చెబుతున్నారు.

మరమ్మతులు చేసినా?

నంద్యాల జిల్లాలోని ఆత్మకూరు, నందికొట్కూరు, బనగానపల్లె, కోవెలకుంట్ల, నంద్యాల, ఆళ్లగడ్డ, డోన్ డిపోల పరిధిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు అధికారులు విద్యార్థి బస్సులను వాడుతున్నారు. మరమ్మతులకు గురైన పల్లె వెలుగు బస్సులను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ బస్సులే అదనపు సర్వీసులకు పెద్ద దిక్కుగా మారాయి. ప్రతి డిపోలో దాదాపు 10 నుంచి 14 బస్సులకు మరమ్మతులు చేసి వాటిని అదనపు సర్వీసుల కింద నడపనున్నారు. కాగా ఈ బస్సులకు మరమ్మతులు చేసినా ఎంత దూరం ప్రయాణిస్తాయి, అసలు ఇవి కండిషన్‌లో ఉంటాయా? మహిళలను, ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తాయా లేదో వేచి చూడాలి.

పాత బస్సులే దిక్కు

నంద్యాల, కర్నూలుతో పాటు ప్రకాశం జిల్లా, వైఎస్సార్ జిల్లా నుంచి శ్రీశైలానికి పెద్ద సంఖ్యలో భక్తులు వెళ్లడం పరిపాటి. మహిళలకు ఉచిత బస్సు పేరుతో పాతవాటినే నడుపుతున్నారు. మహిళలు అధికంగా ఉంటే ఆత్మకూరు నుంచి దోర్నాల మీదుగా 110 కి.మీ. దూరం ఆ బస్సు శ్రీశైలం వెళ్తుందా లేదా అనే ప్రశ్నలు వస్తున్నాయి. అంత దూరం మహిళలు బస్సులో నిలబడి ఎలా ప్రయాణిస్తారు? మహిళలకు కావాల్సిన సీట్లు ఖాళీగా ఉంటాయా? రిజర్వేషన్ సౌకర్యం, ఇతర భక్తులు ఉచితంగా దర్శనానికి వెళ్లే మహిళల పరిస్థితి ఏమిటన్నది తెలియాల్సి ఉంది. మహిళలు శ్రీశైల క్షేత్రానికి పోటెత్తే ప్రమాదం ఉన్నందున అధికారులు స్పందించి శ్రీశైలం మహాక్షేత్రానికి అదనపు బస్సు సర్వీసులను వేయాల్సి ఉంది.

పల్లె వెలుగు సర్వీసులన్నీ తొలగింపు!

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లె వెలుగు బస్సు సర్వీసులు చాలా వరకు తొలగించారు. గతంలో పల్లెలకు ఎన్నో బస్సు సౌకర్యాలు ఉండేవి. కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరం, ఎర్రమఠం, పెద్దగుమ్మడాపురం, గువ్వలకుంట్ల గ్రామాలకు తిరిగేవి. అలాగే పాములపాడు మండలంలోని మద్దూరు, వాడాల, వేంపెంట గ్రామాలకు బస్సు వెళ్లేది. కురుకుంద, కొట్టాల చెరువు, వెలుగోడు మండలంలోని రేగడగూడూరు, గుంతకందాలకు ప్రతిరోజూ రెండు బస్సులు తిరిగేవి. ఆత్మకూరు బస్టాండ్ నుంచి ప్రతి రోజూ పల్లెలకు 15 బస్సులు సర్వీసులు ఉండేవి. ప్రస్తుతం ఈ బస్సు సర్వీసులన్నీ తొలగించారు. దీంతో గ్రామాలకు పల్లెవెలుగు బస్సులు కనిపించని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం బడి పిల్లలకు మాత్రం ఉదయం, సాయంత్రం కేవలం రెండుసార్లు మాత్రమే కొన్ని గ్రామాలకు ఒకే బస్సును కేటాయించారు. దీంతో విద్యార్థులు కూడా ఇబ్బందులు పడుతూనే విద్యార్థి బస్సు సర్వీసు పొందుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

మహిళల కోసం అదనపు ఉచిత బస్సులు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే విద్యార్థి బస్సు సర్వీసులతో పాటు షెడ్‌లో రిపేరీ ఉన్న బస్సులకు కూడా మరమ్మతులు చేస్తున్నాం. శ్రీశైలం క్షేత్రానికి వెళ్లేందుకు బస్సులకు మరమ్మతులు చేయించి ఘాట్ ఎక్కేలా చర్యలు తీసుకుంటాం. శ్రీశైలం క్షేత్రానికి మంచి ఇంజన్ కలిగిన బస్సులను నడుపుతాం. పల్లె వెలుగు సర్వీసులైనా మంచి బస్సులను ఏర్పాటు చేసి మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తాం.

– రజియాసుల్తానా, ఆర్టీసీ ఆర్ఎం, నంద్యాల

వివాహిత ఆత్మహత్య

ఉయ్యాలవాడ: తుడుమలదిన్నె గ్రామానికి చెందిన ఓ వివాహిత శనివారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వేములపాటి సురేంద్రకు అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన మహేశ్వరి(28)తో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అయితే గత కొద్ది రోజులుగా మహేశ్వరి అనారోగ్యానికి మానసికంగా కుంగిపోయింది. మనస్తాపంతో చెందిన ఆమె శనివారం ఉదయం ఇంటిలో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


మృతి చెందిన మహేశ్వరి


కొత్త బస్టాండ్ సమీపంలోని ఈద్గా వద్ద గుంతలు తేలిన రోడ్డు


బిర్లా గేట్ సర్కిల్‌లో అడుగు లోతు గుంతలు


వాల్‌మార్ట్ ఎదుట ఇదీ పరిస్థితి

గుంతలు 'మెరుస్తున్నాయి'

మేము అధికారంలోకి వస్తే రోడ్లను మెరిపిస్తామని టీడీపీ నేతలు ప్రగల్భాలు పలికారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తోంది. మోకాళ్లోతు గుంతలు మెరుస్తున్నాయే కానీ, వీటి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. వాహనదారులు రోడ్డెక్కాలంటే చుక్కలు చూస్తున్నారు. ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాదు.. కర్నూలు నగరం, శివారు ప్రాంతాల్లో అడుగడుగునా రోడ్లు నరకాన్ని తలపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా నిత్యం రద్దీగా వందలాది వాహనాలు రాకపోకలు సాగించే నగరంలోని బిర్లాగేటు, నంద్యాల చెక్‌పోస్టు వద్ద ప్రజల అవస్థలు వర్ణనాతీతం. ఏదో చేస్తారనుకుంటే, ఇంత లోతు గుంతల్లో పడేస్తున్నారని వాహనదారులు కూటమి ప్రభుత్వాన్ని తిట్టిపోస్తుండటం గమనార్హం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


నందికొట్కూరు రోడ్డులోని వినాయక టెంపుల్ వద్ద రోడ్డు దుస్థితి


గుత్తి పెట్రోల్ బంకు వంతెన వద్ద అడుగు లోతు గుంతలు


కర్నూలు శివారులో గుంతలమయంగా హైవే

భార్య మందలించిందని..

కర్నూలు: మద్యం తాగి ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని భార్య మందలించినందుకు భర్త రామకృష్ణ డాంగే (34) ఆత్మహత్య చేసుకున్నాడు. కృష్ణగిరి మండలం కటారుకొండ గ్రామానికి చెందిన డాంగే జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఉపాధి నిమిత్తం కొన్ని నెలల క్రితం కర్నూలుకు వలస వచ్చి గణేష్ నగర్‌లోని ఓ ఇంట్లో ఉంటున్నాడు. భార్య మంగమ్మ ఇళ్లల్లో పని చేస్తూ కుటుంబ పోషణకు చేదోడుగా ఉండేది. డాంగే కొంతకాలంగా మద్యానికి బానిసై పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉండేవాడు. మద్యం తాగేందుకు డబ్బుల కోసం భార్యను తరచూ ఇబ్బంది పెట్టేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం కూడా మద్యం తాగేందుకు డబ్బులు కావాలని భార్యను అడిగినందుకు ఆమె మందలించి ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. కొద్దిసేపటికి గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆమె తిరిగి వచ్చేసరికి ఉరికి వేలాడుతూ కనిపించాడు. ఇరుగుపొరుగు సాయంతో ఉరి నుంచి తప్పించి చూడగా అప్పటికే మృతిచెందాడు. ఇతనికి కూతురు ఉంది. భార్య ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వక్ఫ్ భూములు ఆక్రమిస్తే చర్యలు

- రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓ మహమ్మద్ అలీ

కర్నూలు (అర్బన్): వక్ఫ్ బోర్డు భూములను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓ మహమ్మద్ అలీ హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఆయన కర్నూలు, ఆదోని, నంద్యాల వక్ఫ్ ఇన్‌స్పెక్టర్లు ముక్తార్, సొహైల్, ఇమ్రాన్‌తో కలసి నగరంలోని వక్ఫ్ భూములు, స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ 524లోని అక్రమ కట్టడాలను నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. సర్వే నెంబర్ 151లో రేకు షెడ్డులతో అనధికారికంగా మసీదు నిర్మించారన్నారు. ఈ ప్రాంతంలో వక్ఫ్ భూములను విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నామన్నారు. ఈ స్థలాన్ని 15 సంవత్సరాల క్రితం ఇచ్చిన లీజు ఒకటైతే దానిని మరోలా వినియోగించుకుంటున్నారని చెప్పారు. తద్వారా వారిపై వక్ఫ్ ఆదాయాన్ని అడ్డుకోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే నెంబర్ 62లో అక్రమ నిర్మాణం చేసిన వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయించిన కర్నూలు వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ ముక్తార్‌ను ఆయన ప్రశంసించారు. ఈ విషయాలను కలెక్టర్, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి దృష్టికి కూడా తీసుకుపోయామన్నారు.

14 మండలాల్లో తేలికపాటి వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు 14 మండలాల్లో వర్షపాతం నమోదైంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం జిల్లాలో కనిపించలేదు. ఈ నెల 13 నుంచి జిల్లాలో ఆకాశం మేఘావృతం అవుతున్నా వర్షాలు తేలికపాటికే పరిమితం అవుతున్నాయి. ఆలూరులో 12.4 మి.మీ, ఆస్పరిలో 10.4, పత్తికొండలో 5.8, హొళగుందలో 5.2, హాలహర్విలో 4.8 మి.మీ ప్రకారం వానలు కురిశాయి. జిల్లా మొత్తం మీద సగటున 2.1 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. రానున్న రెండు మూడు రోజుల్లో కూడా జిల్లాలోని వివిధ మండలాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

ఎద్దులను శుభ్రం చేసేందుకు వెళ్లి..

- చెరువు గుంతలో పడి రైతు మృత్యువాత
- రెండు ఎద్దులూ మృతి


చెరువులో పడి మృతి చెందిన వుశేన్ బాషా


ప్రమాదంలో మృతి చెందిన కాడెద్దులు

రుద్రవరం: చెరువులో అక్రమ తవ్వకాలతో ఏర్పడిన గుంతలు ఓ రైతుతో పాటు రెండు ఎద్దుల ప్రాణం తీశాయి. ఆలమూరు గ్రామంలో శనివారం ఈ విషాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గోవిందిన్నె వుశేన్‌బాషా (42) అనే రైతు కొద్దిగా ఉన్న సొంత పొలంతో పాటు వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్య పర్వీన్ కూడా మేస్త్రీగా ఉంటూ వ్యవసాయ కూలీ పనులు చేయిస్తోంది. రోజులాగే వుశేన్‌బాషా శనివారం శీలబోయిన చెరువు వైపు సేద్యపు పనులకు వెళ్లాడు. పనులు పూర్తయిన తర్వాత ఎద్దుల బండిపై ఇంటికి వస్తూ మార్గమధ్యలో ఎద్దులను శుభ్రం చేసేందుకు చెరువు లోపలికి దింపాడు. రైతు ఎద్దులను నీటితో శుభ్రం చేస్తుండగా పక్కనే ఉన్న గుంతలో బండి పోవడంతో ఎద్దులతో పాటు రైతు మునిగిపోయాడు. పక్కనే ఉన్న రైతులు గమనించి బయటకు తీయగా వుశేన్‌బాషా అప్పటికే మృత్యుఒడి చేరాడు. ఎద్దులు సైతం నీట మునిగి మృతి చెందాయి. రుద్రవరం ఎస్ఐ మహమ్మద్ రఫి సిబ్బందితో చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. మృతుడి భార్య పర్వీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రైతు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్యతో ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

మట్టి తవ్వకాల వల్లే..

ఆలమూరు శీలబోయిన చెరువులో శనివారం జరిగిన ప్రమాదానికి చెరువులో అక్రమ మట్టి తవ్వకాలే కారణమని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంలో కొందరు చెరువులో అక్రమంగా మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అలుగు పక్కనే కట్ట మీదుగా వ్యవసాయ పనుల నిమిత్తం ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ రాకపోకలు సాగేవి. అయితే అది దారి అని తెలిసినప్పటికీ పట్టించుకోకుండా కట్టకు కొద్ది దూరంలోనే పెద్ద గుంతలు తవ్వారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో చెరువులోకి భారీగా నీరు చేరింది. ఆ నీటితో పెద్ద గుంతలు సైతం నిండి పోయాయి. గుంతలు గమనించక పోవడంతో ప్రమాదం జరిగి రైతుతో పాటు ఎద్దులు మృత్యువాత పడినట్లు గ్రామస్తులు వాపోతున్నారు.

27 నుంచి గణేశ్ ఉత్సవాలు

- వచ్చే నెల 4న కర్నూలులో నిమజ్జనోత్సవం


ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: గణేశ్ ఉత్సవాలు ఈనెల 27 నుంచి ప్రారంభమవుతాయని గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు వేణు గోపాల్ తెలిపారు. కర్నూలులోని వినాయక ఘాట్ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయం సమావేశ మందిరంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గణేశ్ ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ, గూడూరు, ఇతర పట్టణాల్లో 27 నుంచి 31వ తేదీ వరకు వినాయక చవితి ఉత్సవాలు ఐదు రోజుల పాటు జరుగుతాయన్నారు. కర్నూలు నగరంలో సెప్టెంబర్ 4వ తేదీ నిమజ్జనోత్సవం ఉంటుందన్నారు. గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా కార్యదర్శి గోరంట్ల రమణ మాట్లాడుతూ.. మట్టివినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. నగర అధ్యక్షుడు రంగస్వామి మాట్లాడుతూ.. విగ్రహాల ఎత్తులో కాకుండా సంప్రదాయ పద్ధతిలో ఉత్సవాల నిర్వహణకు పోటీ పడాలన్నారు. మండపాల నిర్వాహకులతో ఆదివారం సమావేశం నిర్వహిస్తామన్నారు. క్రైడో స్కూల్‌లో విద్యార్థులకు 24న వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి నగర కార్యదర్శి గురిరాజవర్మ, సభ్యులు కొట్టే చెన్నయ్య, భాను ప్రకాష్, అక్కెం విశ్వనాథ్ పాల్గొన్నారు.

నేత్రదానంపై అపోహలు తొలగిపోవాలి


నేత్రదానం ద్వారా సేకరించిన నేత్రాలను చూపుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ, డాక్టర్ సుధాకర్‌రావు తదితరులు

కర్నూలు(హాస్పిటల్): నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగిపోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక పెద్ద మార్కెట్ ప్రాంతంలో జయలక్ష్మి(77) అనే మహిళ గుండెపోటుతో మరణించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వారు అక్కడికి వెళ్లి నేత్రదానానికి ఆమె కుటుంబసభ్యులను ఒప్పించారు. వారి సమాచారంతో స్థానిక బుధవారపేటలోని సుశీల నేత్రాలయ సిబ్బంది వెళ్లి ఆమె నేత్రాలను సేకరించారు. శనివారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ మాట్లాడుతూ నేత్రదానంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇందుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ సహకారం కూడా తీసుకుంటున్నట్లు చెప్పారు. సుశీల నేత్రాలయ కంటి వైద్యులు డాక్టర్ పి.సుధాకర్‌రావు మాట్లాడుతూ ఒకరి నేత్రదానం వల్ల ఇద్దరికి చూపు వస్తుందని, అందుకే తమ ఆసుపత్రిలో నేత్ర సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, రెండేళ్ల కాలంలో 110కి పైగా కార్నియా ఆపరేషన్లు నిర్వహించి చూపు ప్రసాదించినట్లు తెలిపారు. నేత్రదానం చేయదలచిన వారు 8886306308ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో గైనకాలజిస్టు డాక్టర్ సావిత్రి, కంటి వైద్యులు డాక్టర్ నేహ సుధాకర్, డాక్టర్ రాఘవప్రీతమ్ పాల్గొన్నారు.

శ్రీమఠంలో భక్తుల సందడి


శ్రీమఠం కారిడార్‌లో భక్తుల కోలాహలం

మంత్రాలయం రూరల్: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో శ్రీమఠం కారిడార్‌లో సందడి నెలకొంది. శనివారం ప్రత్యేక పర్వదినం, గోకులాష్టమి సెలవు దినం కావడంతో భక్తుల కోలాహలం కొనసాగింది. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాధిగా భక్తులు తరలివచ్చి రాఘవేంద్రులు మూలబృందవాన్ని దర్శించుకున్నారు.

గుట్టుగా కెమికల్ ఫ్యాక్టరీ నిర్మాణం


తంగడంచ గ్రామ రెవెన్యూపరిధిలో గుట్టుచప్పుడు కాకుండా నిర్మిస్తున్న ఆద్యా ఆగ్రిక్రాప్ సైన్సెస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ

జూపాడుబంగ్లా: తంగడంచ గ్రామరెవెన్యూ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా ఓ కెమికల్ ఫ్యాక్టరీ నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. తంగడంచ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 358, 359, 368లో ఆద్యా అగ్రిక్రాప్ సైన్సెస్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో కెమికల్ ఫ్యాక్టరీ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఈ విషయం ఇప్పటిదాకా తంగడంచ గ్రామస్తులకెవ్వరికీ తెలియక పోవడం గమనార్హం. ఫ్యాక్టరీ నిర్మాణానికి గ్రామపంచాయతీ తీర్మానంతో పాటు గ్రామస్తుల అభిప్రాయసేకరణ, మండల రెవెన్యూ, అభివృద్ధి అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. గ్రామస్తుల అభిప్రాయసేకరణ తీసుకోకుండానే కెమికల్ ఫ్యాక్టరీ నిర్మాణం జరుగుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. ఫ్యాక్టరీ నిర్మాణం పనులు చూసేందుకు కూడా అక్కడున్న వారు లోపలికి వెళ్లనివ్వటం లేదంటే ఎంత పకడ్బందీగా ఫ్యాక్టరీ నిర్మాణం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. మండల, జిల్లా స్థాయి అధికారులు తంగడంచ వద్ద జరుగుతున్న ఫ్యాక్టరీలో భవిష్యత్‌లో ఎలాంటి ఉత్పత్తులు చేస్తారో, స్థానిక నిరుద్యోగులకు ఎంత మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తారో అనే విషయాలు బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌ను వివరణ కోరగా తంగడంచ భూములు ఏపీఐఐసీ వారికి అప్పగించినందున ఫ్యాక్టరీలకు రెవెన్యూ అధికారుల అనుమతి అవసరం ఉండదని, ఏపీఐఐసీ అధికారులే కంపెనీల నిర్మాణం ప్రక్రియకు సంబంధించిన అన్ని అనుమతులు పర్యవేక్షిస్తుంటారని తెలిపారు.

సెవెన్ సీటర్ ఆటోలు నగరంలోకి నిషేధం

కర్నూలు: గ్రామీణ ప్రాంతాల నుంచి కర్నూలుకు వచ్చే సెవెన్ సీటర్ ఆటోలను నగరంలోకి అనుమతించేది లేదని ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఆటోలు నడుపుతూ జీవనం సాగిస్తున్న డ్రైవర్లు తమ ఆటోలను కర్నూలు నగర శివారులోనే నిలుపుకోవాలని సూచించారు. నంద్యాల చెక్‌పోస్టు, గుత్తి పెట్రోల్ బంకు, బళ్లారి చౌరస్తా, సెయింట్‌జోసెఫ్ కాలేజీ వరకు మాత్రమే ఆటోలకు అనుమతి ఉంటుందని, పోలీసు ఆదేశాలను ఖాతరు చేయకుండా నగరంలోకి ప్రవేశిస్తే కేసులతో పాటు భారీగా చలానాలు విధిస్తామని హెచ్చరించారు. కర్నూలు నగరంలోని పాతబస్తీలో రాధాకృష్ణ టాకీస్ నుంచి నెహ్రూ రోడ్డు మీదుగా (బొంగుల బజార్), మించిన్ బజార్ రూట్లలో ఒక వైపు ప్రయాణం మాత్రమే (వన్‌వే) అనుమతిస్తామన్నారు.